క్లుప్తంగా

నేడు పలు గ్రామాల్లో రోడ్డు షో

తెనాలిఅర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4 గంటలకు కొల్లిపర మండల పరిధిలోని చక్రాయపాలెం, జముడుపాడు, దావులూరు, తూములూరు, దావులూరుపాలెం, శివలూరు, అత్తోట గ్రామాల్లో రోడ్డు షో నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. రోడ్డు షోలో వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

30న చంద్రబాబు తెనాలి రాక

తెనాలిఅర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఈ నెల 30న తెనాలిలో పర్యటించనున్నట్లు తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. బోసురోడ్డులోని జనసేన పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయంత్రం 5 గంటలకు హెలికాప్టర్‌లో చెంచుపేట వస్తారని చెప్పారు. అక్కడి నుంచి రోడ్డు షోగా మున్సిపల్ మార్కెట్ వద్దకు చేరుకుంటారని తెలిపారు. పురవేదిక వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, మొహ్మద్ ఖుద్దూస్, ఫణీదపు దుర్గాప్రసాద్, జనసేన నాయకులు బండారు రవికాంత్, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: తెనాలి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి వయసు సుమారు 60 ఏళ్లు ఉంటుంది. స్టేషన్‌లోని ఐదో నంబరు ప్లాట్‌ఫాం మీద మృతి చెంది పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా లూథరన్ ఆలయ వార్షికోత్సవం

పొన్నెకల్లు(తాడికొండ): మండలంలోని పొన్నెకల్లు గ్రామంలోని పరిశుద్ధ త్రిత్వ లూథరన్ దేవాలయ తృతీయ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పాస్టర్ రెవరెండ్ నాదెండ్ల రాజమోహన్ ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట సర్పంచ్ నూకతోటి మేరిమ్మ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

96 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం

తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డులో అక్రమంగా తరలిస్తున్న 96 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. వివరాల మేరకు.. పొన్నెకల్లు గ్రామానికి చెందిన సూరెడ్డి రామకృష్ణారెడ్డి 96 క్వార్టర్ మద్యం బాటిళ్లతో వెళ్తుండగా.. తాడికొండ అడ్డరోడ్డులో పట్టుకొని ఠాణాకు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం, నగదు పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే తన ఫోన్ నంబరు 86888 31374 నంబరుకు నేరుగా సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

రాజధాని రైతుల ద్రోహి చంద్రబాబునాయుడే

తాడికొండ: రాజధాని రైతుల ద్రోహి చంద్రబాబు నాయుడేనని మంగళగిరికి చెందిన స్వయం ప్రకటిత రాజకీయ వ్యూహకర్త రాకేష్ కుమార్ పేర్కొన్నారు. అమరావతి శంకుస్థాపన ప్రాంతం ఉద్దండ రాయునిపాలెంలో శుక్రవారం ఆయన విలేరు సమావేశం నిర్వహించి, మాట్లాడారు. అమరావతి రైతుల పాదయాత్ర వ్యూహానికి గతంలో తాను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా చంద్రబాబు బాగుందని చెప్పినట్లు తెలిపారు. అమరావతి ప్రాజెక్టు క్విడ్ ప్రోకో అని, బాబు భూములు మొత్తం కొట్టేశారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో సామాన్యులు కూడా నాయకులుగా ఎదిగారన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రజలందరికీ తెలిసేలా చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ప్రజల జీవితాలంటే క్రికెట్ అనుకున్నారా సూపర్ సిక్స్ అంటే ఎంటని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఎకరం రూ.4 కోట్లకు అమ్ముకుంది ప్రజలు కాదని, చంద్రబాబు, ఆయన అనుచరులేనని అందులో సామాన్యులు ఎవరూ లేరన్నారు.

ఆత్మీయ పలకరింపులు.. అడుగడుగునా నీరాజనాలు

- రూరల్ గ్రామాల్లో అభిమానుల సందడి మధ్య సాగిన ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్ రోడ్డుషో
- దారి పొడవునా హారతులు పట్టిన మహిళలు



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్

తెనాలిరూరల్: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ చేపట్టిన రోడ్‌షోకు గ్రామాల్లో విశేష స్పందన లభించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పెదరావూరు, జగ్గడిగుంటపాలెం, మల్లెపాడు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు శివకుమార్ రోడ్ షో నిర్వహించారు. గ్రామాల్లో అడుగడుగునా ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. పెదరావూరు నుంచి సాయంత్రం ప్రారంభమైన రోడ్ షో జగ్గడిగుంటపాలెం, మల్లెపాడు, కంచెవరం గ్రామాల్లో రాత్రి వరకూ కొనసాగింది. ఆయా గ్రామాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎన్నికల ప్రచార వాహనంపై ఆయన ప్రచారంలో ముందుకు సాగారు. గ్రామంలో ప్రచారానికి వస్తున్న ఎమ్మెల్యే శివకుమార్‌కు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. వారందరికీ అభివాదం చేస్తూ ఆయన రోడ్ షోలో పాల్గొన్నారు. మహిళలు ఆయనకు దిష్టి తీస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. అడుగడుగునా మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు.

రోడ్ షోను తిలకించేందుకు బయటకు వచ్చిన ప్రజలతో వీధులన్నీ నిండిపోయాయి. నిరంతరం ప్రజల్లో ఉంటున్న తమ పార్టీకే ప్రజల మద్దతు తెలుపుతున్నారని ఈ సందర్భంగా శివకుమార్ అన్నారు. ఐదేళ్లలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు ఇందుకు ఉదాహరణగా చెప్పారు. ప్రచారంలో ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, పెదరావూరు సర్పంచ్ కాకి రమాదేవి, కుదరవల్లి శంకరరావు, కాకి మనోజ్, బాలరాజు, జగ్గడిగుంటపాలెం సర్పంచ్ కంభం బాలాజీ, ఎంపీటీసీ కాజా భద్రావతి, మల్లెపాడు సర్పంచ్ పినపాటి భారతీదేవి, ఎంపీటీసీ పినపాటి రత్నకుమారి, గ్రామ పార్టీ అధ్యక్షుడు పినపాటి గంగయ్య, మాజీ ఎంపీటీసీ పినపాటి నిరంజన్, పినపాటి అనిల్‌కుమార్, పినపాటి వందన్‌రాజు, పరిశా రాజ్‌కుమార్, ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు.



రోడ్డుషోలో పాల్గొన్న మహిళలు

తెనాలిలో వైభవంగా ఇంద్రహోమం

- వైఎస్సార్ సీపీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి శివకుమార్ గెలుపును ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు
- వైఎస్సార్ బ్రాహ్మణ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహణ
- హాజరైన ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్

తెనాలిఅర్బన్: వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ గెలుపును ఆకాంక్షిస్తూ రాష్ట్ర వైఎస్సార్ బ్రాహ్మణ అధ్యయన కమిటీ ఆధ్వర్యంలో తెనాలిలో శుక్రవారం ఇంద్రహోమం, సూర్యహోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన ప్రముఖ సూర్యోపాసకులు బ్రహ్మశ్రీ జక్కెపల్లి జగన్నాథ శాస్త్రి నరసరావుపేట నుంచి విచ్చేసి క్రతువు నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్ పూజా కార్యక్రమాల్లో పాల్గొని పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ బ్రాహ్మణ అధ్యయన కమిటీ సభ్యులు పోతావఝుల పురుషోత్తమ శర్మ పర్యవేక్షణలో జరిగిన క్రతువులో బ్రాహ్మణ సంఘ నాయకులు త్రిపురారిభట్ల దత్తు, లక్కరాజు లక్ష్మణరావు, పెద్దిరాజు సత్యనారాయణ, కరి సత్యనారాయణ, దొంతరాజు జయలక్ష్మి, కరి అన్నపూర్ణ, పులిపాక శర్మ, చెన్నాప్రగాడ శ్రీనివాస్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ సత్య జ్ఞాన ప్రసూనాంబ, బ్రాహ్మణ క్రెడిట్ కో ఆపరేటివ్ డైరెక్టర్ నందివెలుగు రామకృష్ణ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ సీఎం కావాలని ప్రార్థనలు

తెనాలిఅర్బన్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయ్యేలా అందరూ ఆశీర్వదించడంతో పాటు యేసుక్రీస్తుకు ప్రార్థనలు చేయాలని పార్టీ తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ కోరారు. చెంచుపేటలోని ఆర్‌పీఎం క్లబ్‌లో శుక్రవారం జరిగిన 'ప్రార్థన శక్తి తైలాభిషేక ఆరాధన' లో ఆయన పాల్గొన్నారు. రెవరెండ్ ఇస్సాక్‌తో ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేయించుకుని తైలాభిషేకం పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమానికి సీఎం జగన్ విశేష కృషి చేశారని చెప్పారు. పాస్టర్లకు గౌరవ వేతనం ఇచ్చారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో క్రైస్తవుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ పరిశీలకులు మందపాటి శేషగిరిరావు, పార్టీ నాయకులు రావి శ్రీనివాసరావు, అక్కిదాసు కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్‌కు ఆశీర్వాదం చేస్తున్న రెవరెండ్ ఇస్సాక్

ప్రజారంజక పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి పుష్ప, చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో ప్రజా రంజక పాలన అందించిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికలు పేర్కొన్నారు. 10వ వార్డులోని సెయింట్ జాన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ వెనుక రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి వాటికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, కౌన్సిలర్లు తిరుమలశెట్టి సాంబ్రాజ్యం, కఠారి రత్నకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, చెరుకూరి సురేష్‌రెడ్డి, యలవర్తి గీతాదేవి, కఠారి హరీష్, దేవరపల్లి కిషోర్‌కుమార్, యలవర్తి సాంబశివరావు, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



మహిళలకు కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థిస్తున్న పుష్ప, రాధిక

అంగలకుదురులో జోరుగా ప్రచారం

తెనాలిరూరల్: తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో వైఎస్సార్ సీపీ పార్టీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విజయాన్ని ఆకాంక్షిస్తూ శుక్రవారం సాయంత్రం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పెద్ద కుమారుడు అన్నాబత్తుని సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు. గ్రామంలోని బ్రహ్మంగారి గుడి నుంచి సాగిన ఎన్నికల ప్రచారానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలని కోరుతూ సాగిన ప్రచారంలో దారి పొడవునా అభిమానులు పూల వర్షం కురిపించారు. ఎన్నికల ప్రచారం జేఎంజే కళాశాల సమీపంలోని పెట్రోల్ బంకు వరకు కొనసాగింది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, బండి హైమారావు, ఎంపీటీసీ ముప్పవరపు సంధ్యారాణి, కడియాల సురేష్, మొవ్వ ఆనంద్, చుండూరు గోపి, బండి జగన్‌మోహన్‌రావు, కొండముది విజయ్, కొండముది కిరణ్ చంద్ర, మూకర వీరయ్య, ముప్పవరపు సాంబశివరావు, తోట శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరుగురి నామినేషన్ల తిరస్కరణ

పూర్తయిన నామినేషన్ల పరిశీలన

తెనాలిరూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తెనాలి నియోజకవర్గంలో నామినేషన్ల స్క్రూటినీ పూర్తయ్యింది. ఆరుగురు అభ్యర్థుల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు నామినేషన్ల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ నేతృత్వంలో తెనాలి అసెంబ్లీ నియోజకవర్గానికి నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం జరిగింది. తెనాలి అసెంబ్లీకి మొత్తం 20 మంది అభ్యర్థులు 27 నామినేషన్లు దాఖలు చేశారు. కొంతమంది రెండు, మూడు సెట్ల చొప్పున నామినేషన్లను దాఖలు చేశారు. గురువారంతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగియడంతో శుక్రవారం నామినేషన్ల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రఖర్ జైన్ నేతృత్వంలో జరిగిన స్క్రూటీనీలో ఆరుగురు సభ్యుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 20 అభ్యర్థులకు గాను ఆరుగురి నామినేషన్లు తిరస్కరణ కావడంతో 14 మంది నామినేషన్లు ఆమోదం పొందినట్లు ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ వివరాలు కార్యాలయంలోని నోటీస్ బోర్డులో ఉంచడం జరుగుతుందని చెప్పారు. కాగా తిరస్కరణకు గురైన ఆరుగురు అభ్యర్థుల నామినేషన్లలో ఇరువురు కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు ఉన్నాయి. బీఫారం సమస్యతో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చందు సాంబశివుడు నామినేషన్ తిరస్కరణ కాగా తెలంగాణలో ఓటు ఉన్న కారణంగా మరో కాంగ్రెస్ అభ్యర్థి బషీద్ నామినేషన్ సైతం తిరస్కరణకు గురైంది. 14 మంది అభ్యర్థులు ప్రస్తుతానికి బరిలో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు.

సీఎం వైఎస్ జగన్ పాలనలో మాదిగలకు మేలు

తెనాలిఅర్బన్: రాష్ట్రంలోని మాదిగలు, ఉపకులాల వారికి సంక్షేమం అందించడంతో పాటు వారి అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేశారని ఎమ్మార్పీఎస్ నాయకులు కిన్నెర నాగరాజు పేర్కొన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఉసిరిపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు నాగరాజు బృందం గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ తెనాలి నియోజవకర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు దళితుల పట్ల మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గకరణ విషయంలో కపట నాటకాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే మాదిగలకు మేలు జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దళితులకు ఏ కష్టం వచ్చిన జగన్ అండగా ఉంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఏటుకూరి విజయమాదిగ, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్ మాదిగ, జై గణేష్ మాదిగ, గడ్డం బుజ్జిబాబు, టి.జాన్సన్, సిహెచ్.గోపాల్, సిహెచ్.అనిల్, కువరపు రవి, కారుమూరి సునీల్, వైఎస్సార్ సీపీ నాయకులు అత్తోట చంటి, మేకల రవి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్

పంట కాలువలో మృతదేహం లభ్యం

తెనాలిరూరల్: మండలంలోని కొలకలూరు గ్రామం వద్ద పంట కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. సుమారు 30 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. వ్యక్తి మృతి చెంది నాలుగు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. మృతుడు ఎరుపు రంగు టీషర్టు, నల్ల రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

పెదకాకాని: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పెదకాకాని పాతూరు ఏరియాకు చెందిన షేక్ ముస్తాఫా వంట పనికి, గ్రామంలోని టుబాకో కంపెనీలో కూలీగా వెళ్తూ.. జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున మోటార్‌తో నీళ్ల పట్టాడు. అనంతరం స్విచ్ ఆఫ్ చేసే సమయంలో కరెంట్ షాక్ తగిలి అక్కడే పడిపోయాడు. కుటుంబ సభ్యులు స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించి, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే షేక్ ముస్తాఫా(32) మరణించాడు. మృతునికి భార్య మెహరున్నీసా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

మేడికొండూరు: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందగా, మరొకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రమైన మేడికొండూరు జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని బ్రిడ్జి వద్ద జరిగింది. గుంటూరు నుంచి సత్తెనపల్లి వైపు వెళ్తున్న లారీ, సత్తెనపల్లి నుంచి గుంటూరు వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఎం.శ్రీనివాసరావు (45) తీవ్రగాయాలపాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అతని అత్త గుడిపూడి కౌశల్యకు స్వల్ప గాయాలు కాగా, స్థానికులు గమనించి క్షతగాత్రురాలిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేఎల్‌యూలో ఇంజినీరింగ్ ప్రవేశాలు ప్రారంభం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్, వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ, హైదరాబాద్ క్యాంపస్‌లో ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభించారు. జాతీయస్థాయిలో నిర్వహించిన కేఎల్‌యూ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ కేఎల్‌యూ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల్లో జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన శెట్టిపల్లి జుహి నందన, మలోజి అనీ స్పందనలకు కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీటు కేటాయించడంతో పాటు నాలుగు సంవత్సరాల పాటు నూరు శాతం ఫీజు రాయితీ ఇచ్చినట్లు చెప్పారు. విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో మూడు విడతలుగా జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు వెల్లడించారు. ఇంజినీరింగ్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కేఎల్‌యూ కౌన్సెలింగ్– 2024 కమిటీ చైర్మన్ డాక్టర్ ఎ.జగదీష్ మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు వచ్చిన ర్యాంకులు, ఇంటర్‌లో వచ్చే మెరిట్ మార్కులు, జేఈఈ మెయిన్స్ ర్యాంకుల ఆధారంగా వారు కోరుకున్న విభాగాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, కో–ఆర్డినేటర్ డాక్టర్ టి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు ప్రాణం పోయాలి

- రాపోర్, గౌహతి ఐఐటీ డైరెక్టర్ ఆచార్య రాజీవ్ అహూజ
- ఘనంగా ఎస్ఆర్ఎం 8వ రీసెర్చ్ డే వేడుకలు
- ఐదుగురు ప్రొఫెసర్లకు ఉత్తమ పరిశోధన అవార్డులు



జ్యోతి ప్రజ్వలనగావిస్తున్న ఆచార్య రాజీవ్ అహుజ, వీసీ మనోజ్

మంగళగిరి: యువ పరిశోధకులు, రీసెర్చ్ స్కాలర్లు నూతన సృజనతో ముందుకు రావాలని, కొత్త ఆవిష్కరణలకు ప్రాణం పోయాలని రాపోర్, గౌహతి ఐఐటీ డైరెక్టర్, శాస్త్రవేత్త ఆచార్య రాజీవ్ అహుజ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 8వ రీసెర్చ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన సభలో విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. దేశంలో ఐఐటీల ఉన్నతికి ప్రధాన కారణం పరిశోధనలేనన్నారు. పరిశోధన రంగంలో కాలు మోపుతున్న రీసెర్చ్ స్కాలర్లు సమూహంగా ఏర్పడి పరస్పరం తమ ఆలోచనలను చర్చించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లోనూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ప్రవేశ పెడుతుందని, దీని వల్ల మరింత సత్ఫలితాలు లభిస్తాయన్నారు. విశిష్ట అతిథి కోల్‌కతా యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఆమ్లాన్ చక్రవర్తి జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరా యూనివర్సిటీ ప్రగతిని, పరిశోధనలకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా పరిశోధనల్లో పురోగతి సాధిస్తున్న ఐదుగురు ప్రొఫెసర్లకు యూనివర్సిటీ యాజమాన్యం ప్రత్యేక అవార్డులను ప్రకటించింది. అవార్డు కింద ఒక్కొక్కరికీ రూ. 50వేల నగదు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, రీసెర్చ్ డే కన్వీనర్ డాక్టర్ ప్రత్యూతకుమార్ పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన ఉండాలి

నెహ్రూ నగర్: ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు ఈవీఎంల వినియోగంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులు కేటాయించబడిన ఇంజినీరింగ్ అధికారులకు ఎన్నికల ప్రాసెస్, ఈవీఎంల నిర్వహణపై డెమో ఈవీఎంల ద్వారా శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల పని తీరుపై ఇంజినీరింగ్ అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్లు కమిషనింగ్, పోల్ సమయంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారం చేసేలా సిద్ధమవ్వలన్నారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు తప్పనిసరిగా ఎన్నికల ప్రాసెస్‌పై అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల రోజు ఈవీఎంల్లో ఏ సమస్య ఎదురైనా తక్షణం పరిష్కారం చేసేలా శిక్షణ పొందాలన్నారు. శిక్షణలో ఏఆర్ఓ సునీల్ కుమార్, ఈఈ సుందర్‌రామిరెడ్డి, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

అలరిస్తున్న నృత్య ప్రదర్శనలు

నగరంపాలెం: అంతర్జాతీయ నృత్య దినోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 23న ప్రారంభమైన నృత్య ప్రదర్శనలు సభికులు, ప్రేక్షకులను అలరిస్తున్నాయి. పలు రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శిస్తున్న నృత్యాలు ఆకట్టుకుంటున్నాయి. శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తున్న వేడుకలు శుక్రవారం నాలుగో రోజుకి చేరాయి. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేయగా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. 17వ శతాబ్దపు పాలకుడు శ్రీ విజయ రాఘవ నాయకుడు రచించిన 'విప్రనారాయణ చరిత్ర' యక్షగానం ప్రేక్షకులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యం నృత్య దర్శకునిగా, విప్రనారాయణుని శిష్యునిగా, సూత్రధారిగా, విప్రనారాయణునిగా తేరల శ్రావణ్‌కుమార్, దేవ దేవిగా పటకమూరి సుప్రియ, దేవ దేవి తల్లిగా పూల భరణి, సోదరిగా పచ్చల నాగమహిత, విజయ రాఘవనిగా నాత్యాచార్య బాలు, రంగ మన్నారుగా అక్షయరెడ్డి, రాజా నర్సకి మనులుగా నారా హర్షిని, జమ్ముల కుసుమాంజలి, కె.తన్మయశ్రీ, గరికపాటి శ్రీ అన్నయ్య, ఆదిరాజు కృత్తిక, తంజావూరు నర్తకిగా తాళ్లూరి ధరణి అద్భుతంగా తమ పాత్రలను పోషించారు.

జీజీహెచ్‌లో డెప్యూటీ కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు

గుంటూరు మెడికల్: రాబోయే రోజుల్లో గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి పరిపాలన విభాగం అటు ప్రజలకు, ఇటు వైద్యేతర సిబ్బందికి మరింతగా సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. ఆస్పత్రిలో ఏఓ కార్యాలయాన్ని మరమ్మతులు చేసి డెప్యూటీ కలెక్టర్ కార్యాలయంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పరిపాలన విభాగంలో అనేక సంస్కరణలు వచ్చాయని అందులో భాగంగా పరిపాలన సౌలభ్యం కోసం మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రిని ఒక యూనిట్‌గా తీసుకున్నారని చెప్పారు. ఇక నుంచి మెడికల్ కళాశాలకు, ఆసుపత్రికి ఒక పరిపాలన విభాగం అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులను నిర్వర్తిస్తారని తెలిపారు. వీరిని పర్యవేక్షణ బాధ్యత డెప్యూటీ కలెక్టర్‌కు అందచేశారన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు డెప్యూటీ కలెక్టర్ రిపోర్ట్ అందిస్తారని వివరించారు. డెప్యూటీ కాల్ లెటర్ హోదా పెరగడం వలన పరిపాలన విభాగం బలోపేతమవ్వడమే కాకుండా ఆసుపత్రి సిబ్బందికి సేవలు వేగవంతం అవుతాయని చెప్పారు. వైద్య సిబ్బంది ఫైళ్ల పెండింగు లేకుండా చేసే అవకాశం ఉంటుందన్నారు. డెప్యూటీ కలెక్టర్ విధి విధానాలు కూడా ప్రకటించారని చెప్పారు.